# గజదొంగ వీరన్న

(కథానిక)

యన్. ఆర్. నంది

"ఇంకా రాలేదామ్మా వాడూ" అనుకొంటూ, ఇంతవరకూ బయట సమకాలికులతో సరసాలాడుతూ వున్న ముసలాడు గడపెక్కాడు. కోడలు, మంగమ్మ నించి లేదనే సమాధానం వినగానే పైమీది దుప్పటి సరిగా కప్పుకొంటూ, "వాడింకా రావడానికి చివరి హద్దు తొలికోడికూత వుంది. అప్పుడే ఎందుకొస్తాడు, ఎలా వస్తాడు?" అంటూ తలుపు చారవేసి, వార్ధక్యంవల్ల తడబడ పడుతున్న అడుగులతో లోపలికి వచ్చాడు.

మంగమ్మ యింతవరకూ చంటివాడికి పాలు పడుతోంది. మామ రావడంతో, ఒడిలో నిద్రపోయిన పిల్లవాడిని మంచంమీద దించి, ఒక్క నిట్టూర్పువిడిచి తలుపు తీసుకొని బయటకి వచ్చింది. అమావాస్య రోజేమో! బయట చీకటి దట్టంగా వుంది. వీధిచివర గుడ్డిదీపపు వెలుగులో ఏదన్నా సడి అగుపిస్తుందేమో నని అటు తిరిగిచూసి, తల నిరాశతో తిప్పుకొంటూ లోనికివచ్చి తలుపు గడియ వేసింది. లోపలి నుంచి ముసలాడి దగ్గు వినిపిస్తోంది.

"పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోగాని పోదంటారు. వాణ్ణి ఎన్నిసార్లు జైళ్లల్లో పెట్టి లాఠీలతో కుల్లబొడిచినా వాడిబుద్ధి మాత్రం పోదు" అంటున్నాడు.

మంగమ్మకి మామ మాటలు వినిపిస్తున్నాయి. మెల్లగా అడుగులేసుకొంటూ వచ్చి పిల్లవాడి పక్కన కూచుంది. వాడు, తన నాన్న చెడ్డవాడయినా ఎంతహాయిగా నిద్రపోతున్నాడు!

"వాడిని ఈ జైలువాళ్ళు అవాసం, పున్నానికి యెందుకు విడుదల చేస్తూంటారో? వాళ్ళకి తెలీదులాగుంది: వాడి చెయ్యి అవాసకి, పున్నానికి అల్లాడుతుందని? మనిషనే వాడికి ఒకసారి చెబితే బుద్ధుండాలి. ఇంట్లో పెళ్ళాం బిడ్డలు ఛస్తున్నా, వెధవకి బొత్తిగా బుద్ధీ, గ్యానంలేదే? నిన్న 'విడుదలై వచ్చాడు, ఈవాళకి సరి ఎప్పటి వీరడే! ఎవరన్నా చూస్తే మళ్ళా వెధవకి గుమ్మిక్కులు."

ఇంతవరకు నిశ్శబ్దంగా కన్నీరు విడుస్తున్న మంగ, భర్తపక్కలో ఈ రక్షకభటులపోట్లు, మోచేతుల గుమ్మిక్కులు, చీకటికొట్లో బంధించి చేత్తో, కాలితో యిష్టమొచ్చినట్టు, ఎక్కడబడితే అక్కడ తన్నులు, తాపులు——అన్నీ జ్ఞాపకం రాగానే వొళ్ళంతా విరుచుకపోయినట్టు, బాధగా పిచ్చికేక వేసింది.

"నీ ఆ కేకలకి, ఏడ్పులకీ లొంగడమ్మా వాడు. వాణ్ణి కట్టుకొని నువ్వు నరకంలో పడ్డావమ్మా" దగ్గుతూ మెల్లగా అంటున్నాడు ముసలాడు.

ఇది నా పూర్వజన్మ పాపఫలితం—అని అనేయాలనుకొంది. కాని నాల్క చివరవరకూ వచ్చిన మాటలని అంతరాత్మ కళ్ళాలు వేసి వెనక్కిలాగింది.

"నీతో పొద్దుట అన్ని ఒట్లువేశాడు: ఇక రాత్రులు యెక్కడికీ వెళ్ళననీ, పిల్లాడిని నరుక్కుతిన్నట్టనీ. వాణ్ణి మోసం చేశాడు- చూశావా ఆ వెధవలోని మూర్ఖత్వం. ఈ తాగుబోతులూ, జూదర్లూ, దొంగలూ యింతేనమ్మా."

"కాదు" అంది మంగమ్మ, అప్రయత్నంగా తనకి తెలీకండానే, దృఢంగా, కంపిస్తున్న కంఠంతో.

ముసలాడు నవ్వాడు సన్నగా, మంగమ్మ అమాయకత్వానికి.

"నీకు ప్రపంచమంటే ఏమిటో యింకా సరిగా తెలీదమ్మా. ఈ దురభ్యాసులు మన మనుకొన్నంత సులభులు కారు. దురభ్యాసం తెలీకండానే అబ్బుతుంది. వాణ్ణి పూర్తిగా నాశనం చేస్తుంది. వాడికి తెలీకండానే వాణ్ణి

వొదులుతుంది. కాని ఆకాలం ఎప్పుడో యెవరికీ తెలీదు. దురభ్యాసీ మనలాగే పశ్చాత్తాపపడతాడు. వాడు నిజంగానే ఏడుస్తూ తల బాదుకొంటాడు. కాని ఆ అభ్యాసం వాడికి మత్తునీ మైకాన్నీ కలుగజేస్తుంది. వీణ్ణి చూస్తున్నావుగదమ్మా? ఇది ఏ పదోసారో జైలు కెళ్ళడం! నీతో దొంగతనం చేయడం, కల్లు తాగడం, జూదం అడ్డం మానేస్తానని యెన్ని సార్లు నీ కాళ్ళు పట్టుకొన్నాడు? పట్టుకొని ఏడ్చాడా లేదా? మళ్ళా కాసేపు నీ ముఖం చాటవగానే దేనింట్లోనో దూరి తందనాలాడేవాడా లేదా? ... అదేనమ్మా! ... ఈ వెధవ యెప్పుడు తిన్నబడతాడో గూడ చెప్పలేం!" అన్నాడు.

మామ ఈ మాటలనడంతో మంగ కంటి నించి కన్నీరు బొటబొట రాలింది. ముఖాన్ని చేతుల్లో దాచుకొని బలవంతంగా, కంఠంకింద నించి రేగుతున్న ఏడుపుని అణచేసింది.

"ఎందుకమ్మా ఏడవడం? నీ ఏడ్పు వాడి మతిని మారుస్తుందా?... ఇప్పుడొస్తాడు. నువ్వేడుస్తుంటే వాడూ యేడుస్తాడు. ఒట్లు వేసుకొంటాడు. నీకాళ్ళు పట్టుకొంటాడు. కాని రేపో? దేవుడు ఒక్కొక్కర్ని అలానే సరదాగా మొండిఘటాల్లా సృష్టిస్తుంటాడు."

"అయితే అతని మనస్సింక మారదా?" అంది మంగ కన్నీటిని కోకకొంగుతో తుడుచుకొంటూ.

"మారుతుందనే అనుకొంటాడు వాడూను. ఆలానే పశ్చాత్తాపడతాడు. కాని ఆసమయం రాబోయేసరికి వాడికే శపథమూ జ్ఞాపకముండదు. వాడు దుర్మార్గాలు చేస్తాడు. నువ్వు వారిస్తే చిన్నపిల్లాడిలా యేడుస్తాడు. నీ దగ్గర వాడు దుర్బలుడు. కాని నీముఖం చాటయితే? బెబ్బులి... సరే, ఇంకెందుకు, పడుకోమ్మా. వాడొస్తే నేను లేచి తలుపుతీస్తాను" అన్నాడు.

కొడుకుని ఒళ్ళోకి తీసుకొని వాడిముఖం చూసింది మంగ. ఏ ఆలోచనా లేకండా యెంత హాయిగా నిద్రపోతున్నాడు! కాని తన నిద్రలో? ఎప్పుడు వొంటిమీద తుమ్మకర్రలు ఛెళ్లుమంటాయో అనే ఆవేదన, విచారం, వ్యథ!

మామ అనేది నిజమే. భర్త పొద్దుట శపథాలు చెస్తాడు. రాత్రిళ్లు దొంగతనాలు చేస్తాడు, వ్యభిచరిస్తాడు. తను ఏడిస్తే, రేపులో ఎంతో హాయి, నమ్మిక, సులభత్వం వున్నట్టు, రేపటి నించే మానేస్తా నంటాడు. కాని 'ఈవాళా', 'రేపూ' ఒక తాడుమీదే నడుస్తున్నవని తెలుసుకోలేడు. ఆ 'రేపు' 'ఇవాళ' అవగానే, మళ్ళా ఆ నమ్మికని రేకెత్తించే రేపుకి శపథాన్ని, నియమాన్ని పొడిగిస్తాడు.

ఆమెదగ్గర వీరన్న పిల్లిలా నసుగుతాడు, క్రూరమృగంలాగు హింసిస్తాడు. పసిపిల్లాడిలా ఏడుస్తాడు, క్రూరుడులా ఏడుస్తాడు. అతన్ని నమ్మాలో, నమ్మగూడదో; దండించాలో, ఆజ్ఞాపించాలో గూడ తెలీక తికమక పడుతూంది మంగ.

ఎనిమిదేళ్ల క్రితం పెళ్ళయింది. కాని కొంత కాలంవరకూ కుటుంబపోషణ ఎలాజరుగుతుందో మంగకి తెలీనే తెలీదు. డబ్బు ఇంట్లో వుండడం మూలాన బహుశః ఆ డబ్బుతోనే జీవిస్తున్నారనుకొంది. తర్వాత కొద్దికాలంలో భర్త జైలు కెళ్ళి ఒకఏడాది శిక్ష ననుభవించడంతో వీరన్న జీవితాన్ని పూర్తిగా వూహించేసింది. అందుకే సాధారణంగా ఎప్పుడూ యింట్లో వుండేవాడు కాడు. రాత్రిళ్ళు నోరంతా వాసన.

చంటివాడు పుట్టినప్పుడోసారి జైలుకెళ్లాడు. అతను జైలులో వున్నకాలంలో ఇంట్లో డబ్బు లేక చాల సామాన్లు బజారులో పెట్టబడ్డాయి. విడుదల అయివచ్చాడు. ఇంట్లో ఒక్క పైసా లేదు. జైలుకూడు తినితిని చచ్చినజిమ్మకి కాస్త పులుసుముద్ద గూడ యింట్లో కరవయింది. వీరన్న గంజి తెస్తాననే నెపంమీద ఒక భోగం దానింటికెళ్ళి దాన్ని డబ్బు కాస్త యివ్వమన్నాడు. అది ఇవ్వనంది. తన సొమ్ము తిని, తన్నిప్పుడు తిరస్కరిస్తోందని దాన్ని చచ్చేట్టు బాదాడు. వెంటనే మళ్ళా కారాగారం.

తర్వాత రెండుమూడుసార్లు శిక్ష అనుభవించాడు. నిన్ననే విడుదలయ్యాడు. ఇంటికొచ్చాడు. ఇంట్లో తిండిలేదు. వీరన్న జైలులో వున్నప్పుడు చివరి బిందె గూడ అమ్మి గంజి కాచుకొన్నారు. నిన్న భర్త విడుదలయి వస్తే కాస్త గంజిగూడ కాచి ఇవ్వలేకపో

యింది. అంతలో మెరుపులా తన క్రపెట్టెలో వున్న కాసులుపేరు జ్ఞాపకానికొచ్చి, దాన్ని తీసి భర్తకిస్తూ "తిండానికి తిండిలేదు. పస్తులతో చంటివాడు బల్లయిపోతున్నాడు. పోనీ ఈ కాసులుపేరు దొంగతనం చేయలేదు కదా. దొంగతనం చేసిన డబ్బులోంచి చేయించావు. ఇది అమ్మినా, దొంగసొమ్మని ఎవరూ పట్టుకోరు. వెళ్లు" అంది.

వీరన్న భార్య చేతిలోని కాసులుపేరుని చూసి కన్నీరు విడచాడు. ఛా! ఇంకెప్పుడూ ఈ వెధవజైళ్ళలో పడగూడదు. అనుకొంటూ ఆ వస్తువుని తీసుకొని "ఇప్పుడే తెస్తా" నను కొంటూ వెళ్ళిపోయాడు. ఇంతవరకూ ఐపు లేదు. ఎక్కడికి పోయాడో గూడ తెలీదు. డబ్బునిచూస్తే భర్త కళ్లుమిటకరిస్తాడని మంగకి తెలుసు. ఇంట్లో పరిస్థితులని చూసి, యెంతో మారిపోయినవాడిలా ఏడ్చినా, చేతిలో డబ్బు పడగానే తన ధోరణే తనది. మంగమ్మ ఇలా అనుకొంటూనే చిన్నవాడి పక్కలో నిద్రపోయింది.

తెల్లవారి మూడవుతుందనగా తలుపు దగ్గర శబ్దం వినిపించింది. మంగ ఏదో కలకొచ్చినట్టు గభుక్కున లేచింది. గుండె దడదడ మంటోంది.

"తెలతెలవారింది తొలికోడి. కూసింది
చల్లాని నామంగా లేవే; లేచి చల్లాగ ..."

తలుపుదగ్గర మేల్కొలుపు పాట నీరసంగా వినిపిస్తోంది.

మంగ గబగబా వెళ్ళి తలుపు తీసింది. తుళ్లుకొంటూ వీరన్న లోపలికి ఛెంగున దూకాడు. "మంగా! ఓయ్ మంగా."

మెల్లగా నిట్టూర్పు విడిచి మంగమ్మ తలుపు వేసింది. వీరన్న వెనక్కి చూశాడు.

"ఓస్! ఇక్కడే నక్కివున్నావే? రా, రా నీకోసం..."

"ఎక్కడికి వెళ్ళావ్?" అని అడిగింది గట్టిగా.

"ఎక్కడికి! ఎక్కడి కేమిటి? స్వర్గానికి. అక్కణ్ణించే."

"అక్కడే వుండిపోలేక పోయావ్?"

"అలాగే అనుకొన్నాను. ఓయ్ మంగా నువ్వు జ్ఞాపకానికొచ్చావ్. నాకు...నాకు నువ్వు కాసులు పేరిచ్చావ్ కదూ? దాన్ని ఐదు వందల కమ్మేశాను. అమ్మేసి అదంతా దాని కిచ్చేశాను. నాకది కడుపునిండా బువ్వ పెట్టింది. నీకు కొంచెం తేవాలనుకొన్నాను కాని..."

మంగమ్మ శిలయిపోయింది. అనుకొన్నంత పని చేశాడు. ఈవేళంతా పస్తేగాకండా, రేపటి నించి యిక పస్తులతోనే కాలాన్ని గడపాలి. ఎంత కోపాన్నైనా దిగమింగుకొంటోంది. పసి పిల్లాడిలా, ఒక టడిగితే, మరోదానికి సమాధానం చెబుతున్నాడు వీరన్న. వెనక వున్న వాళ్లు ఆకలికి కిరకిర్లాడుతున్నా అతని కదేమీ అర్థమవడం లేదు.

"అవును నిన్ను కట్టుకొన్నందుకు, నిన్ను నమ్మి నీతో వుంటున్నందుకు మమ్మల్ని సరైన తోవనే నడిపిస్తున్నావ్. నువ్వు నీ దారినే చూసుకొంటున్నావుగాని, వెనక మేం ఛస్తున్నామో, ఆకలితో గింజుకొంటున్నామో నీ కవసరం లేదు."

"ఛా! అలా ఎందుకంటావే? చూడు, నీ కోసం ఐదు వందల రూపాయలు కూడ బెట్టి తెచ్చాను" అంటూ జేబు తడుముకొన్నాడు. ఏముంది? వుంటేగా అగుపించడానికి? "లేవు ఆది నేనెంత వద్దంటున్నా లాగేసుకొంది" అన్నాడు పెదవి కొరుక్కొంటూ.

"అవును, దానింటి కెళ్తే అది వూరుకుంటుందా?"

"నేను వెళ్ళాలని వెళ్ళలేదు. ఆ ముండే నన్ను పిలిచింది."

"అది పిలిచింది. నీ కాళ్లు నీకు తెలీకండా ఈడ్చేశాయి. ఒకపక్క బాబు ఆకలి ఆకలంటో ఏడుస్తోంటే, 'ఉండు నాన్నా, నాన్న బజారు కెళ్ళాడు' అని వాణ్ణి ఎంత జోకొట్టినా ఏడుపు మానలేదు. మనలాగు వాడికి ఆకలిని కట్టుకునే శక్తన్నా వుంటే...అయినా ఒట్లు వేస్తూ పెద్దాళ్ళే మరచిపోతోంటే ఇక..."

"వూరుకోవే మంగా. పొద్దుట అవబోయే సరికల్లా మనకి గంజి దొరుకుతుంది."

"అడుక్కొంటావా? అడుక్కొన్నా ఎవరూ పొయ్యరు మన ముఖాల్ని చూసి. ఏ గుమ్మం ముందు కెళ్ళినా దొంగని తన్నేవారే

గాని, వీడు నిజంగా మారిపోయేడు అని కనికరించే వాళ్ళుండరు. ఎందుకా వెధవ దొంగతనాలు చేయడం, శుభ్రంగా అన్ని కూలిపనులు దొరుకుతూంటే?"

"నే నెప్పుడూ పేదల కడుపులు కొట్టనేమంగా. ఈ ధనవంతుల్ని ... నేను దొంగతనానికి వెళ్ళినప్పుడు నువ్వు నా వెంబడి రాలేదు గాని, వాళ్ళ యినప్పెట్టెల నిండా ఎన్నెన్ని రూపాయలు రాసుల్లా వుంటాయే!"

"అందుకని తెరగదియ్యడానికా ఈ దొంగతనాలు? పాపాల్లోకల్లా పాపమని తెలుసా? వాళ్ళా డబ్బు పోయిందని ఏం ఏడుస్తుంటారో."

"ఎందుకేడుస్తారు? వాళ్ళ బాబుల సొమ్ములనా? మనల్ని చంపి లాక్కొంటున్న డబ్బే కదూ? చూడు నా ఆస్థంతా పోయినా, నే నెంత సరదాగా వున్నానో?"

"దొంగ సొమ్ము కెంతో గడించిన సొమ్ములా మాటాడతా వేమిటి?"

"వాళ్ళు చేసేదీ అదే గదే? పోనీలే."

"నీతో నేనింక బతకలేను. నేను కూలి పని చేసుకొని ఆ చిన్నాడిని పోషించుకొంటాను. నీ సావాస మబ్బిందంటే, నీలాగే వాడూ తయారవుతాడు. నేను పోతానులే." అంటూ మంగ వీరన్నని తప్పించుకొని పిల్లాడిని తీసుకపోవడానికి, చంటాడి దగ్గరకి వెళ్ళింది. ఇక మంగ మనసుగూడ విరిగిపోయింది. ఆ భర్తతో అలాబతకలేననుకొంది. "నేను పోతా"నని దృఢంగా మంగ అనడంతో వీరన్న నిషా అంతా విరిగిపోయింది. వెనక్కి తిరిగాడు.

వాడు ప్రపంచానికి భిన్నంగా పుట్టాడు. బాగా మాటాడుతూంటాడు. ఒక్క క్షణంలో ఏ కారణం లేకండా ఎదుటివారిని కొట్టి చంపేస్తాడు. భార్యతో సరదాగానే మాటాడతాడు. కాస్త సుడి తిరిగిందా దాని జుట్టు పట్టుకొని గొడ్డుని బాదినట్టు బాదేస్తాడు. తర్వాత ఏడుస్తాడు.

"నీకేం లోటు జరుగుతూందని బయటకి పోతానంటున్నావ్?" అన్నాడు మంగ దగ్గరగా వచ్చి.

"అంతా లోటే. నరకంలో పడ్డాను. నన్ను పోనియ్" అని పిల్లాడిని తీసి ఎత్తుకొంది.

వీరన్న తల తిరిగిపోయింది. ఏవిటి, తనని, ప్రపంచాన్నంతనీ గజగజలాడించే గజదొంగని, ఇది జడిపిస్తోంది! అబ్బ, ఎంత లోకువైపోయాడు! వెంటనే కోపిష్టి అయిపోయాడు.

"నువ్వు పోతే పో, వాణ్ణిమాత్రం ఇక్కడొదిలేయ్" అని అరచాడు.

"నే నుంచను, నువ్వేం చేసినా. నా కొడుకు నాదగ్గరుండాలి" అంటూ కొడుకుని వీరడి చేతుల్లోంచి బలవంతాన లాగేసింది.

వీరన్న రుద్రుడైపోయాడు. ఇనప గోడలని తన్నే వాడి దీర్ఘ బాహువులు తమ శక్తిని జ్ఞప్తికి తెచ్చుకొన్నాయి. వెంటనే విజృంభించి మంగ మెడని పిసికాయి.

"నేను వాణ్ణివ్వను. ఇ...వ్వ...ను" అని గింజుకొంటూనే చేతుల్లో పిల్లాడిని కింద వొదిలేసింది.

కిందపడ్డ పిల్లాడు కెవ్వుమన్నాడు. ఆ చేతులతోనే వీరన్న మంగని బయటకి తోసేసి తలుపు వేసుకొన్నాడు. పిల్లాడి అరుపులు విని ముసలాడు లేచాడు. మెల్లగా అడుగు లేసుకొంటూ అక్కడికొచ్చాడు. గుక్కపెట్టిన పిల్లాణ్ణి లాగి ఎత్తుకొన్నాడు వీరన్న.

"ఎప్పుడొచ్చావురా? మంగమ్మేది?" అన్నాడు ముసలాడు. గగ్గోలు పెట్టేస్తున్న పిల్లాడిని ఊరడించలేక గింజుకొంటున్న కొడుకుతో:

"తోసేశాను బయటికి. దానికె పిల్లాడు కావాలట..."

"బయటికి తోసేశావా? హరి, వెధవ!" అనుకొంటూ ముసలాడు గబగబా తలుపు దగ్గరకి వెళ్ళాడు.

"తలుపు తీయొద్దు. అది యింట్లోకి రాగూడదు" అంటూ ముసలాడు తలుపు తియ్యకండా, వీరన్న అడ్డువెళ్ళాడు.

"తప్పుకో" ఘర్జించాడు ముసలాడు-గజదొంగని కన్న రక్తమే కదూ ఆ ముసలాడిది కూడా!

"మాట దక్కదు. దాన్ని యింట్లోకిరానిస్తే ఒప్పుకోను" అని ప్రతిసవాల్ చేశాడు వీరన్న.

"చూద్దాం" బలమంతా వుపయోగించి వీరన్నని తోసేశాడు. పిల్లాడితో సయితం వీరన్న పక్కన దబ్బునపడ్డాడు. ఎత్తుకొన్న పిల్లాడు భయపడి యింకా పొలికేకలు పెట్టేస్తున్నాడు. వీరడు ఉగ్రుడై నిలబడ్డాడు.

మెట్లమీదినుంచి దొర్లిపోయిన మంగమ్మకైతే తీవ్రమయిన దెబ్బలు తగల్లేదు గాని, చేయి మాత్రం కొస్త బెణికింది. ముసలాడు గబగబా మెట్లుదిగి పడివున్న కోడలిని ఎత్తి లోపలికి తీసుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు.

"దాన్ని యింట్లో వుంచితే నేనుండను. నీకదే కావాలంటే దాంతోనే వుండు" కళ్లు పెద్దవిచేస్తూ అరచాడు వీరన్న.

ముసలాడికి కోపం హెచ్చిపోయింది. పిడికిలి బిగించికొడుకు దగ్గరకి దూకుడుగావచ్చాడు.

"నిన్నిక్కడెవడూ వుండమని పట్టుకోవడం లేదు. నువ్వు యింట్లో వుంటేనే శని పట్టుకొని మమ్మల్నందర్నీ ఇలా పీడిస్తోంది. నువ్వు నిమషనిమషానికీ కక్కుర్తిపడుతూ జైళ్ళల్లో పడుతూంటే, మేం నీకోసమే కాచుక్కూచుని నోళ్లు తెరుచుకోవడంలేదు. నువ్వు వుంటే మాకు ఒరిగేదేదీ లేదు. జైల్లో నువ్వున్నప్పుడెలా బతికామో యిప్పుడూ అలానే బతుకుతాం...

"నువ్వేలాంటి తందనాలాడుతున్నా, అడ్డు చెప్పకండా మంగమ్మ నీ కాలికింద పడుంటే గూడ ఆమెను కదిపించి, లేపి, ఎదురుగా ఒక మాటాడితే జుత్తు పట్టుకొని చావుదెబ్బలు కొడుతూంటావ్? అది నీపెళ్లాం అయినందుకే నీకంత హక్కుంటే దాని రక్తంమీద దానికి హక్కుండదూ? ఇచ్చేయ్ ఆ బిడ్డని—"

"దాని బిడ్డా?" అని అరచాడు వీరడు.

"నోర్ముయ్" ముసలాడి నోట్లోంచి పిడుగులు రాలాయి. కొడుకు నోరెత్తాడా, బిగించిన పిడికిలి వాడి ముక్కుని బద్దలు చేసేదే "దాని బిడ్డ కాకపోతే తొమ్మిదినెలలూ మోసి నువ్వు కన్నావురా? వాడు ఆకలికి అల్లాడి పోతూంటే నువ్వా వాడికి పాలిచ్చి జోకొట్టావు? వాడికి నాలుగేళ్ళొచ్చినా యింత అన్నం ఒక్కసారయినా కలిపి నోట్లో పెట్టావురా? ఇచ్చేయ్ ఆ పిల్లాణ్ణి" అని వీరడు చేతిలోని పిల్లాణ్ణి లాక్కొన్నాడు.

"ఇవ్వు..." అంటూనే వీరడి వేళ్లు పట్లు తప్పాయి.

"అమ్మా..."అని పిల్లాడు బెదిరి కేక వేశాడు.

"చూశావురా. 'నాన్నా'అని ఎప్పుడయినా పిలుస్తాడురా వాడు? నీకు 'నాన్నా' అనిపించుకొనేందుకు తాహతుంటేకదూ? తల్లీ పిల్లల్ని పిల్లాడు పసివాడుగావుండగానే వేరు చేసినా, పిల్లాడి నోట సహజ్యోచ్ఛరణ "అమ్మా" అనేదాన్ని మాన్పించలేవు. నాలుక కోసినా వాడి బండనాలక అదే పలుకుతుంది. కోర్టెక్కినా వాళ్ళూ నీలాంటి వెధవలేగాబట్టి పిల్లాడు తండ్రికే చెందుతాడంటారు. నువ్వలా మళ్ళీ అన్నావా చూడు నిన్నేం చేస్తానో? నువ్వు రౌడీవైతే అవొచ్చు. నువ్వు గజదొంగవైతే కావచ్చు. కాని నా ముందు మాత్రం నువ్వు ఎలకపిల్లవి"ముసలాడి ఉద్వేగం హెచ్చిపోతూంది.

మంచంమీంచి మంగమ్మలేచి గబగబా ముసలాడిదగ్గరికొచ్చింది"అతన్నేమీఅనొద్దు.పిల్లాడు సుఖంగా పెరగడం కావాలి. తల్లిదగ్గరైతేనేం? తండ్రి దగ్గరయితేనేం? ఇక్కడే వాణ్ణి వొదిలేస్తే, వాడికి పోషణ సరిగ్గా జరగదు, తండ్రి దగ్గరుండి తండ్రి బుద్ధులన్నీ నేర్చుకొంటాడనే భయం వల్లే నేను అలాతీసుకు పోతానన్నాను. ఒట్టేసి ఈవాళ పశ్చాత్తాపపడ్డా రేపటికి మామూలువాడే అయిపోతాడు. అందుకే అతని మీద నాకు నమ్మకంలేదు. నేను చచ్చిపోతే ఆదురలవాట్లన్నీ మానుతాడనుకొంటాను" అంటూ కంట తడిపెట్టుకొంది.

"వాడికిక మనసు మారదమ్మా.రాతిగుండె. ఆ మనసే మారితే నిన్ను బయటికి పొమ్మనే వాడు కాడు"అంటూ ముసలాడు మంగమ్మ తల నిమిరాడు. ముసలాడి చేతుల్లో పిల్లాడు తల్లికేసి చూసి ఏడుస్తున్నాడు. ముసలాడు పిల్లాణ్ణి కోడలికిచ్చాడు.

"విన్నావురా? ఛీ! నీదీ ఓ బ్రతుకే? అన్న మాటని జంతువులన్నా ఆచరిస్తాయి. నీకదీ తెలీదు. పొద్దుట ఒట్లు వేస్తావు. మళ్ళారాత్రికి కక్కుర్తి... నీలాంటి కుక్కని గూడా ఆమె

ఎంతగా నమ్ముతుందో చూడు. నిన్ను కొట్టబోతే అడ్డుకొంది. నీమీద అయిష్టతవల్లా అడ్డుకొంది?... నువ్వా పిల్లాడిని చేరదీస్తావ్. వాణ్ణి నీలాగు గజదొంగలా తయారుచేస్తావ్. కాని తల్లిప్రేమలో పెరిగి వాణ్ణి మంచివాడుగా తయారుచేయాలనే ఉద్దేశమే లేదు నీకు.''

వీరన్న ఏమీ మాటాడలేక పోతున్నాడు. లేక లేక కలిగాడు వీడు. మామూలు మానవుడులాగే వీరన్న కొడుకుపుట్టాడని గంతులేశాడు. వాడికోసమని ఒక యింట్లో కన్నం వేశాడు, దొరికాడు. తన్నులు తిన్నాడు. మూణ్ణెల్ల శిక్ష గూడ అనుభవించాడు. వాడు పోట్లు తినింది గాకండా, వాడి చర్య మూలంగా పోలీసులు ఇల్లు తనిఖీ చేస్తామనే నెపంమీద ఇల్లంతా వెదకి పచ్చిబాలింత మంగను ''నీకు తెలీదే ముండా?'' అని తలమీద యిత్తడి పన్ను లాఠీతో కొట్టారు పోలీసులు. భర్త నేరం భార్య అనుభవించింది. కన్నంపడి తలనించి రక్తం కారింది. ఆ కారిన రక్తాన్ని పాలని భ్రమించి ఆ చిన్నాడు గభుక్కున పీల్చాడు.

ఇప్పుడు ఆ పిల్లాడిగురించే తను మంగని యింటినించి గెంటేస్తున్నాడు. సమస్యలన్నీ తలలో గిర్రుమంటున్నాయి. ఒకపక్క భార్యాపిల్లలు, రెండోపక్క డబ్బుని, వేశ్యని, కల్లుని చూడగానే హృదయదౌర్బల్యం. ఏదిముఖ్యం? తన్ను నమ్మి తన సుఖాన్ని కోరే భార్యాపిల్లలా, లేక నీచాతి నీచమయిన వేశ్య, డబ్బు, తాగుడు ముఖ్యమా? భార్యా పిల్లలు పరమ పూజ్యులా? అవును, అవునంటోంది అంతరంగం. కాదు కాదని పురెక్కిస్తోంది తన బలహీనత. తనసుఖాలకి, తన సంతోషాలకి వేశ్య, తాగుడు కావాలి. కాని ఈ పెళ్ళాంపిల్లలు? వాళ్లూ తన సుఖానికే. అయితే తను ఏపక్షం తీసుకోవాలి? తల తిరిగిపోతోంది. మంచంమీదికి వెళ్లి పడిపోయాడు. ముసలాడు తల్లిని, పిల్లాడిని ఓదారుస్తూ లోనికి తీసుకపోయాడు.

తెల్లవారింది. అనూరుడు ఎంత వడిగా కళ్ళాలు లాగుతున్నాడోగాని, అప్పటికప్పుడే సూర్యుడు దిబ్బండలాన్ని విడచి ఆకాశంలోకి చాలాదూరం వచ్చేశాడు.

ఏదో గంజి కాచింది మంగమ్మ. ముసలాడు బయట చెట్టుకిందకూచొని తప్పటడుగులేస్తున్న మనమడితో మాట్లాడుతున్నాడు.

మంగమ్మ కంచంలో గంజిపోసి చల్లారుస్తోంది. వీరన్న మంచంమీంచి లేచి కళ్లు నులుపుకొన్నాడు. ఏమీ జ్ఞాపకంలేనట్టే లోపలికి వెళ్ళాడు.

''మంగా'' అని పిలిచాడు. మంగమ్మ తలెత్తి చూసింది. ''ఈవాళనించి కూలిపని చేస్తానే'' అన్నాడు. మంగమ్మ క్రీగంట చూపుతో భర్తనిచూస్తూ 'సరే' అన్నట్టు ముత్యాల చిరునవ్వు నవ్వింది. వీరన్న ఆ నవ్వుని చూసి పరవశుడయిపోయాడు. చాల బాధపడ్డాడు: రాత్రి, పాపం, దాన్ని నిష్కారణంగా తోసేసినందుకు.

''రాత్రి పెద్ద దెబ్బ తగల్లేదుకదే మంగా? ఇదుగో నిజం చెబుతున్నాను, ఇంతకముందంతా ఏమో అనేవాడినిగాని, ఈవాళ నా బిడ్డ సాక్షిగా అంటున్నాను: ఇకమీదనించి దొంగతనం చెయ్యను. తాగుడు ముట్టుకోను. ఆ ముండలకేసే అసలు చూడను. నిజంగా నమ్ము. చూడు యిప్పుడే పడవలరేవులో పని దొరుకుతుంది. మనింట్లో అన్ని సామానులూ అమ్మేశాం కదూ? దొంగసొమ్మంతా పూర్తిగా పోయింది. ఇకనుంచి మన యిల్లు దొంగయిల్లు కాదు. కొత్తసంసారం, కొత్తవీరడి యిల్లు. అవును. రాముడేడీ? పాపం, వాడు రాత్రి చాలా ఏడ్చాడు. వాణ్ణి బాగాచదివించి పెద్దవాడిగా తయారు చేస్తాను...'' ఏవేవేవిటో అనేస్తున్నాడు. దురభ్యాసిలో మరభ్యాసం వాడికి తెలీకండానే ప్రవేశిస్తుంది. పూర్తిగా నాశనం చేస్తుంది. నమ్మికని గూడా అలానే ప్రేరేపిస్తుంది- చివరికి ఓడి వీగిపోతుంది.

మంగ నవ్వుకొంటూ ఆమాటలని వింటోంది. ఉప్పు కలిపిన గంజి యిచ్చింది. వీరన్న అది తాగి మంగతో మళ్లా ఆమాటలే ఆడి బయలుదేరాడు వీరుడిలా.

చాల హుషారులో వున్నాడు వీరన్న. ఇప్పుడు తను యింతకముందులా దొంగ కాదు, ఒక కష్టజీవి కాబోతున్నాడు. ఇంతకముందులా కుప్పలుగా డబ్బురాదు. అయినా ఆ కొద్ది

నాణాలే చాలు తను కష్టపడి చెమటూడ్చితే.

పడవల రేవులో ఒక షావుకారు దగ్గరకి వెళ్ళాడు. కూలీలందరూ, 'ఏమిటీ విచిత్రం వీరడు ఇక్కడికొచ్చాడు' అనుకొంటున్నారు.

"దొంగల్నీ, వ్యభిచారుల్నీ, తాగుబోతుల్నీ నమ్మకూడదబ్బాయ్" అని ఆ షావుకారు తను పనిచేయడానికి వస్తే సుభాషితాలు మొదలు పెట్టాడు.

వీరడు చాలవరకూ కోపాన్ని తగ్గించుకొని అతన్ని బతిమాలాడు. కాని ఒకసారి ఒకడు మానవ దృష్టిలో నీచంగా అగుపించాడా, వాడి జీవితమంతా యిక ఆ నీచత్వంలోనే గడపాలి. మానవ అంతః పటలం, వాడు మారినాసరే, వాడి ఛాయనిమాత్రం ప్రస్తుత వ్యక్తిగా కాకండా, ఎంతోకాలం వెనక వున్న వాడి ఛాయనే గ్రహిస్తుంది. అలానే పరిగణిస్తుంది గూడ! వీరన్న ఎంత ఒదుగుతూ ప్రాధేయపడుతున్నాడో, అంత ఆ ధనవంతుడు అధికారాన్ని వుపయోగించాడు. సాధారణంగా దొంగలు ఎవరినీ ఎక్కువగా బతిమాలరు. వాళ్ళలో ఆత్మాభిమానం, మామూలు మానవులకంటె ఎక్కువ స్థాయిలో వుంటుంది.

"కత్తి చూస్తే లొంగేవారు, కాళ్లు పట్టుకొంటే లొంగుతా,రా?" అని అరుచుకొంటూ వీరడు అక్కణ్ణించి విసురుగా వెళ్ళిపోయాడు.

వీరన్నలో మళ్ళా శక్తి విజృంభించింది. ఏం చేయాలో అర్థం గావటంలేదు. "కష్టపడి పని చేస్తానంటే నిరాకరిస్తున్నారు. రక్తాన్ని కళ్ళ చూస్తానంటే వాణికి నోట్ల కట్టలు ఇచ్చేస్తారు. ఆ వెధవ పనికిరాని అచ్చు కాయితాలకే యింత కక్కుర్తి. రాత్రి అవనియ్ ఆ షావుకారు పని పడతా" ననుకొంటూ వెనక్కి తిరిగాడు.

కాని యింకా మధ్యాహ్నమే కాలేదే? మధ్యాహ్నం తిండి కావాలి, రాత్రికి తిండి కావాలి. రెండు పూటలు! తను ఇక్కడ రాత్రి అవడంకోసం యిలా తను పౌరుషంతో వేచి వుంటే అక్కడ ముసలాడు, మంగ, రాముడూ ఆకలికి గిరగిల్లాడరూ? అలా పైకి చూశాడు.

ఐదారంతస్థుల భవంతులు. ద్వారానికి సిల్కు తెరలు. రాత్రులు విద్యుద్దీపాలు. కాని తనిల్లు? ఒక దొంగది. ఒక దుర్మార్గుడిది. ఒక తాగుబోతుది. తను గూడా ఈ ప్రజల మధ్యే వున్నాడు. ఈ ప్రజల యిళ్ళ మధ్యే తన యిల్లుని గూడ కట్టుకొన్నాడు. ఆ ప్రజలతోనే మాటాడుతున్నాడు. కొంతమంది తను పలకరిస్తే పలకరిస్తారు. మరికొందరు ముక్తసరిగా మూడుమాటలే ఆడతారు, మరికొందరు అసలు చూడనే చూడరు. కాని కత్తి చూపిస్తే... తన కాళ్లు పట్టుకొని, ఆ గుక్కెడు బుడగ ప్రాణంకోసం బతిమాలుకొంటారు, ఏడుస్తారు. తర్వాత తను పోలీసులకి దొరికి, వాళ్ళ లాఠీల పోట్లలో గిలగిల్లాడుతుంటే చంకలు గుద్దుకొని ఎగురుతారు. విడుదలయి వొచ్చినపుడు తిండి లేక మళ్లా కత్తిపట్టుకొని ఈ ధనవంతుల యింటికే వెళ్ళి జడిపిస్తే, తమనోళ్లదగ్గర తిండినే కాకండా, తమ చిన్నపిల్లలకి పట్టే పాలని గూడ వొణుకుతూ తనకి సమర్పించేస్తారు. కాని తను న్యాయంగా బాబూ, నాయనా అని అడుక్కుంటే మాత్రం కుక్కని విదిలించినట్టు విదిలిస్తున్నారు.

తను దొంగతనం చేస్తాడు. అందుకు శిక్ష కారాగారం. అక్కడ సరిగ్గా అన్నం పెట్టరు. రోజూ కష్టపెడుతుంటారు. తిరగబడితే లాఠీలతో పక్కల్లో పొడిచేస్తారు తలమీద రక్తాలు కారేట్టు. రాక్షసుల్లా బాదుతారు... జైలు నించి విడుదల అయిన తర్వాత ప్రవర్తన ఏమన్నా మారుతుందా అంటే ఏమీ వుండదు. మామూలు మనిషే. అయితే ఈ కారాగార శిక్షలు, దొంగలు దొంగతనాలు చేస్తున్నందుకా, లేక వాడింకెప్పుడూ దొంగతనం చేయకండా వుండే సన్మార్గుడుగా తయారు చేసే కొలిమి లిత్తులా? వీరడు అదెప్పుడూ ఆలోచించలేదు. పుట్టాడు. పుట్టాడు కాబట్టి పెరగాలి. పెరగాలి గాబట్టి ఈ నరులు తయారుచేసిన కృత్రిమ నాణాలని సంపాయించాలి. ఆ సంపాదన ఎలా? ఒకరినించి తీసుకోవాలి. అది బలవంతంగా అయితే దొంగతనం, ప్రతిఫలంగా అయితే జీత భత్యాలు. అంతే తేడా! అందుకే ఈశిక్ష గూడా!

వాడు జైలుకి వెడతాడు. ఎందుకు? దొంగతనం చేస్తాడు గాబట్టి. ఇప్పుడు ఆ పావుకారు యింట్లో తను దొంగతనం చేస్తాడు. శిక్ష ఏమిటో గూడ తెలుసు. అయినా చెయ్యాలి. అది వాడికో "హాబీ" అయిపోయింది. తన కొడుకు ఏడుస్తూంటాడు, వాడిని ఊరడించలేక మంగ దుఃఖిస్తుంది. దాన్ని ఏడిపించగూడదు. అందుకే ఆ దొంగతనం చేయాలి.

అలా పిచ్చిగా ఆలోచించుకొంటూ వెళ్లిపోయి ఊరి చివర పాడు దేవాలయంలో పడుకొన్నాడు... తెలివొచ్చేసరికి చుట్టూ చిట్టచీకటి. అప్పుడే పన్నెండు అయినట్టుంది, ఎక్కడా అలజడి లేదు.

లేచాడు, మొలనున్న చిన్న కత్తిగూడ మేల్కొని హుషారయింది. మెల్లగా అడుగులేశాడు. పొద్దుట తను పనిచేస్తానంటే నిరాకరించిన పావుకారింటికి. కాని కాళ్ళు మాత్రం తనింటికే లాక్కుపోతున్నాయి. ఛా! ఇదేమిటి? గంజి దొరకని యింట్లోకి కాళ్ళు దారితీస్తున్నాయే?... లక్షలు గా యినప్పెట్లో మూలుగుతున్న ధనవంతుల యిళ్లకి వెళ్ళవేం? బలవంతాన అడుగులు మార్చాడు.

ఈ వాళ రాత్రి వాడింట్లో దొంగతనం చేస్తాడు. అవును. రోజంతా మండుటెండలో కష్టపడితే పన్నెండణాలు చేతికిరాని ఈ కూలి పనికంటే, పగలంతా యింట్లో హాయిగా పడుకొని, రాత్రి కాసేపటి వరకూ కునుకుతీసి ఆ తర్వాత కన్నాలు వేస్తే-ఓ-లక్షలు కుమ్మతాయి. వెధవది ఎందుకలా గొడ్డుల్లా కష్టపడడం?

వెళ్లాడు. గాజుతలుపుల్ని బద్దలు కొట్టాడు. కత్తిమాత్రం ఎర్రబడలేదు.

తెల్లవారుతుండగా, మంగ నులకమంచం మీదనుంచి లేస్తూ కిందపడిపోయింది. తలకి మంచం కోడు తగిలి కన్నం పడింది.

అదేసమయాన పోలీసు లాఠీలు, వీరడు తలనించి బలవంతాన రక్తాన్ని బయటకి చిందించాయి.

# తెలంగాణా వాస్తవ స్థితి

"విధేయుడు"

ఈ మధ్య పత్రికల్లో తరుచు తెలంగాణలో ప్రశాంతత గూర్చి అధికార వార్తలు చూస్తున్నాం. "తాచు పాము అంతపడి, జర్రిపోతు అంత పిరికి" అన్నట్టుగాఉంది మన వారి పని. యథార్థ పరిస్థితుల్ని సమగ్రంగా తెలుసుకోకుండా బాధ్యతా రహితంగా ప్రజారంగంలో ఉపన్యాస వేదికలపై తమ వాగ్ఝరిని కురిపించడం మన నాయకులకు అలవాటైపోయింది. ఆదుష్పరిణామఫలితాన్ని అనుభవించడం ప్రజలకు, తప్పనిసరి అయింది.

ఈ మధ్య నల్లగొండ, వరంగల్ జిల్లాలు పర్యటించివచ్చిన శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారు (తెలంగాణ కాంగ్రెసు అధ్యక్షులు) పత్రికా ముఖంగా, నల్లగొండ వరంగల్ జిల్లాలలో ప్రశాంతత ఏర్పడినదని వెల్లడించారు. ఇదే రకంగా కొందరు ప్రభుత్వోద్యోగులు కూడా తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

కాని, ఈ నాడు తెలంగాణలో హత్యలు, విధ్వంసక విధానాలు తగ్గినంత మాత్రాన కమ్యూనిజం పోయిందనిగాని, ఇకముందు పోతుందనిగాని భావించడం పొరపాటు. ఏనాడైనా కమ్యూనిజం అనేది, మానవ సమాజంలో ఆర్థికంగా అసమానత్వం అంటూ ఉండేంత వరకు పోయేదికాదు. కమ్యూనిజం, (నేటి వాతావరణ రీత్యా) పోవాలని భావించినా, పెట్టుబడిదారీ విజృంభణవల్ల బాధపడుతున్నంత కాలం కమ్యూనిజం తప్పక అభివృద్ధి చెందుతుంది. అందుకనే కమ్యూనిజం పోవాలనేదాని